క్లుప్తంగా

విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


మెమొంటో, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈవోలు, దాత సుబ్బారావు

యర్రగొండపాలెం: విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు సూచించారు. స్థానిక శివాలయంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆర్యవైశ్య నాయకుడు గోళ్ల వీర వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన 24 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదివి ఉన్నత శిఖరాలను అధిష్ఠించాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 మల్లూ నాయక్, ఉపాధ్యాయులు పీఎల్.నారాయణ, రాజు, మధు, నాగేశ్వరరావు, శేషయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారులు హాజరు కావాలి

పుల్లలచెరువు: ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని తహశీల్దార్ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులంతా తహశీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు హాజరు కావాలన్నారు. కింది స్థాయి సిబ్బందిని పంపవద్దని అన్నారు.

రాజంపల్లి సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

దర్శి (కురిచేడు): దర్శి మండలం రాజంపల్లి గ్రామ సర్పంచ్ వనం అన్నపూర్ణ చెక్‌పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకటనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసి దుర్వినియోగం చేశారని సర్పంచ్ అన్నపూర్ణపై ఉపసర్పంచ్ వజ్జా నాగమణి అభియోగం మోపడంతో చెక్‌పవర్ రద్దుచేశారు. అన్నపూర్ణ హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియమ్ ఉత్తర్వులు పొందటంతో ఆమెకు చెక్కుపవర్‌ను పునరుద్ధరించినట్లు డీపీవో తెలిపారు. సంబంధిత అధికారులందరూ అన్నపూర్ణ సంతకంతో నిధులు డ్రా చేసేందుకు ఆమోదించాలని ఆదేశించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాల అడ్డరోడ్డులో ఉన్న సెంట్రల్ చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సింగా రాజేష్ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్న కోటయ్య, మందా నాగేష్, సింగా సురేష్ బాబు, చాట్ల ఇర్మియా, పెద్ద సిమోన్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయాలి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో సోమవారం జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొర్రపాటి విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట



దొనకొండ రైల్వేస్టేషన్


స్టేషన్ ఎదురుగా అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

- దొనకొండ రైల్వేస్టేషన్‌లో నిలిచిన అభివృద్ధి పనులు
- ప్రయాణికులకు ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు

దొనకొండ: అమృత భారత్ పథకం కింద గుంటూరు రైల్వే డివిజన్‌లోని దొనకొండ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ నిధులతో హడావిడిగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఎంతో ఆర్భాటంగా చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికాకుండా నిలిచిపోవడంతో దొనకొండ రైల్వేస్టేషన్‌లో సమస్యలు తిష్టవేశాయి. స్టేషన్ ఎదురుగా అందమైన పార్కు, పాదచారులు నడవడానికి సీసీ రోడ్లు, సైడు కాలువలు, మరుగుదొడ్ల పనులు మొదలు పెట్టారు. ఆరు నెలల నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఆయా పనుల పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదు. 20 శాతం కూడా పనులు చేపట్టలేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి అసంపూర్తిగా నిలిచిపోయింది. 2వ ప్లాట్‌ఫాం పనులు చేపట్టలేదు. ఎవరైనా అభివృద్ధి పనుల గురించి అడిగితే నిధులు లేవు, కాంట్రాక్టర్ ముందుకు రాలేదంటూ సమాధానం దాటేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో నిధులు మంజూరు చేసిన సమయంలో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గుంతకల్లు, హుబ్లీ, తిరుపతి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, ఒరిస్సా తదితర ప్రాంతాలకు దొనకొండ రైల్వేస్టేషన్ మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు 10 రైళ్ల వరకూ తిరుగుతుంటాయి. అలాంటి దొనకొండ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల కోసం తోలిన ఇటుక, సిమెంట్, ఐరన్ ఎక్కడికక్కడే ఉండిపోవడంతో మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి అభివృద్ధి పనులు పూర్తి చేయించి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యువత పోరును జయప్రదం చేయండి


యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు


కురిచేడులో యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి (కురిచేడు): ఒంగోలులో సోమవారం తలపెట్టిన వైఎస్సార్ సీపీ యువత పోరు ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ డి.నారాయణరెడ్డి కోరారు. దర్శిలోని పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, దర్శి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డితో కలిసి ఆదివారం యువతపోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యువజన విభాగం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సూచనలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో జరిగే యువత పోరులో నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంవత్సర కాలంగా ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురిచేడులో...

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపు మేరకు సోమవారం ఒంగోలులో పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ కురిచేడు మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య కోరారు. ఆదివారం యువత పోరు పోస్టర్‌ను కురిచేడులో ఆయన ఆవిష్కరించారు. సంవత్సరకాలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మోసానికి గురైన యువతకు బాసటగా నిలిచే క్రమంలో సోమవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జీ లింగారెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సారెడ్డి నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యుడు కొలూరి నర్సింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతంతోనే వామపక్షాల ఐక్యత



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యుల పిలుపు

దర్శి (కురిచేడు): సీపీఐ బలోపేతంతోనే వామపక్షాల ఐక్యత పెరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. దర్శి పట్టణంలో జరుగుతున్న సీపీఐ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. అధ్యక్షతవర్గంగా యాసిన్, లక్ష్మి, రమేష్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజలను సమీకరించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం ద్వారా పార్టీ వేగంగా బలోపేతమవుతుందని అన్నారు. ఆగస్టు నెలలో ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య రాష్ట్ర మహాసభల నిర్వహణకు సహకారాన్ని అందజేశారు. దర్శి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషిచేసిన సీనియర్ నేత బోడాడ వీరాంజనేయులు, కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘంగా పనిచేసిన సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్యలను మహాసభ ఘనంగా సత్కరించింది.

విద్యాబోధనలో షరీఫ్ సేవలు మరువలేనివి

పెద్దదోర్నాల: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించటంలో షరీఫ్ సేవలు మరువలేనివని సబ్ రిజిస్ట్రార్ బాల గురవయ్య కొనియాడారు. పెద్దారవీడు మండలం సానికవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు టీచరుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన షరీఫ్‌ను ఆదివారం ఘనంగా సత్కరించి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని షరీఫ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ధర్మానాయక్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి, తెలంగాణా హైకోర్టు అడ్వకేట్ కాశీరావు తదితరుల పాల్గొన్ని షరీఫ్‌కు దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.


షరీఫ్‌ను ఘనంగా సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పొంగళ్లు


పూజలందుకుంటున్న గుంటి గంగా భవానీ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలను, శ్రీ మల్లికార్జునస్వామివారిని పూజించారు. ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కే ప్రసాద్, సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


పుల్లలచెరువు సెంటర్ లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పుల్లలచెరువు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సంపత్‌కుమార్ సూచించారు. రహదారి భద్రత కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఎస్పీ ఆదేశాలతో చాలా ప్రదేశాలల్లో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహదారుడు హెల్మెట్ ధరిస్తే తనతో పాటు తన వెనుక ఉన్న కుటుంబ సభ్యుల జీవితాలు కూడా ఆధారపడి ఉన్నాయనే సంగతి మర్చిపోకడదని అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ భారం అనుకోకుండా తప్పని సరిగా ధరించాలన్నారు. చాలా మంది ప్రయాణికులు పడిపోయినప్పుడు హెల్మెట్ పెట్టుకుని ఉండడం వలన ప్రాణాలు పోకుండా ఉన్న సంఘటనలు అనేకం ఉన్నాయని, మండల ప్రజలు హెల్మెట్ వాడడం తప్పని సరిచేసుకోవాలని సూచించారు. విద్యావంతులు, ఉద్యోగులు కూడా బాధ్యతగా తీసుకుని హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర మాదిగ

దర్శి (కురిచేడు): ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న తర్వాత మొదటిసారి వస్తున్న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా ఇన్‌చార్జి సొట్ట నరేంద్రమాదిగ పిలుపునిచ్చారు. దర్శిలో ఆదివారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. గత 30 ఏళ్లుగా మాదిగ జాతి కోసం పోరాడిన ఎంఆర్‌పీఎస్ ఇక నుంచి దేశం కోసం పోరాడబోతున్న నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఇతర అనుబంధ సంఘాల గ్రామ, మండల స్థాయి కమిటీలను బలోపేతం చేసి భవిష్యత్ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి తొరటి ఆనంద్, నియోజకవర్గ ఇన్‌చార్జి యోగేశ్వరరావు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనీందర్, ఎంఈఎఫ్ నాయకుడు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంపై చెట్టు !


స్థానిక వెలుగు కార్యాలయం గోడలో చెట్టు

పెద్దారవీడు: స్థానిక వెలుగు మండల మహిళా సమాఖ్య కార్యాలయం భవనంపై చెట్టు పెరగడంతో గోడలు నెర్రలు ఇస్తున్నాయి. చెట్టు పెద్దది అయ్యే కొద్దీ గోడలు నెర్రలు ఇచ్చి వర్షం నీరు లోనికి వెళ్లి శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురినప్పుడల్లా నీరు గోడల్లోకి పోతుండటంతో పాచి పడుతోంది. చాలా రోజుల నుంచి గోడలో ఉన్న చెట్టును పీకేయాలనే ఆలోచన అధికారులు చేయలేదు. కార్యాలయంలో అధికారులు నిత్యం విధులు నిర్వహిస్తుంటారు. ఏ రోజు కార్యాలయం రెండో అంతస్తు గదులను శుభ్రం చేసిన దాఖలాలు కనిపించలేదు. కార్యాలయం రెండో అంతస్తుపై పడమటి పక్క గోడలో నుంచి ఏపుగా పెరిగిన చెట్టు ప్రతి ఒక్కరికీ కనిపిస్తుంది. కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్టు పెద్దదిగా పెరిగి గోడలో పెద్ద పెద్ద నెర్రెలు ఇచ్చి శిథిలావస్థకు చేరకముందే చెట్టు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

ఘనంగా శ్రీకృష్ణుని కళ్యాణ మహోత్సవం


రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవంలో అర్చక స్వాములు, దంపతులు

ఒంగోలు మెట్రో: మండల పరిధి కొప్పోలు గ్రామంలో గోపాలకృష్ణ స్వామి మందిరం 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సత్యభామ, రుక్మిణి సమేత శ్రీకృష్ణ కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణ క్రతువులో బాపట్ల సనత్ కుమార్ దంపతులు, సుబ్బారావు దంపతులు, దొడ్డ పవన్ కుమార్ దంపతులు, కొండరాజు సురేష్ దంపతులు, మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు బాపట్ల కొండయ్య, మొడిపోయిన వెంకటరత్నం, అధ్యక్షుడు కొప్పుల సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి నెల పొంగళ్లు


పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు


పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లె గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామికి ఆదివారం నెలపొంగళ్లు సమర్పించారు. వార్షికోత్సవం జరిగి నెలరోజులు కావడంతో నెలపొంగళ్లు చేయడం ఆనవాయితీ. గ్రామంలోని మహిళలందరూ ఉదయాన్నే ఆలయం వద్దకు శుచిగా వచ్చి పొంగళ్లు తయారు చేసి స్వామివారికి నివేదించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.